"ఆవాంతులూ తలతిరిగినట్టుండటం, స్పృహ తప్పడం... ఈ లక్షణాలన్నీ చూస్తోంటే మీ అత్తగారికి మామూలు తలనొప్పో మైగ్రెయినో అనిపించటంలేదు. నా అనుమానం ఆవిడ బ్రెయిన్లో ట్యూమరుండొచ్చని. అహహ... కంగారొద్దు. అది నా అనుమానం మాత్రమే. నేను కొన్ని టెస్టులు రాసిస్తాను. తలకి స్కాన్ కూడా తీయించాలి. ఇక్కడ అంత పెద్ద లేబొరేటరీలు లేవు. సిటీకి వెళ్ళి అవన్నీ చేయించండి. వాటి రిజల్ట్సునిబట్టి ట్రీట్మెంటు విషయం ఆలోచిద్దాం".

డా॥అమరనాథ్ అంటున్న మాటలు కన్సల్టింగ్ రూం దాటి వెయిటింగ్ హాల్లో కూర్చున్న నా చెవులబడిన ఆ క్షణం-

తలలో ఫెటీల్మని ఏదో పెద్దగా విస్ఫోటనం. నరనరానా అగ్నికీలలు వేగంగా వ్యాపిస్తోన్న అనుభూతి. కళ్ళముందు చీకటి వలయాలు గిర్రున తిరుగుతున్న భావన. నాకేమవుతున్నదో నాకే తెలీని స్థితి.

అలా ఎంత సేపున్నానో... "వెళదామా అత్తయ్యా" అల్లుడు నందగోపాల్ గొంతు విని తిరిగి ఈ లోకంలో కొచ్చాను. కానీ మనస్సు ఏదో జడత్వం ఆవహించి నట్టు స్తబ్దుగా ఉంది.

ఇంటికి వచ్చాం.

"ఏమన్నారు డాక్టరు?" ఎదురొచ్చి అడిగింది నా కూతురు మాలతి.

నేను నోరు విప్పలేదు.

"మామూలు తలనొప్పే. కాకపోతే చిన్న ప్రాబ్లం. ఓ టెస్టేదో చేయించుకొస్తే మందులు రాసిస్తానన్నాడు. రేపు సిటీకెళ్తున్నాం. ఆ పరీక్షేదో చేయించుకొస్తే సరిపోతుంది".

నందగోపాల్ జవాబు నా కూతుర్ని సమాధానపరచ వచ్చేమోగానీ బ్రెయిన్ ట్యూమరంటే సాక్షాత్ మృత్యువు ప్రతిరూపమే అని తెలిసిన నన్ను ఎలా మభ్యపెట్టగలదు?



సరిగ్గా ఏడాదిక్రితం నా ఆడపడుచు లలితాంబ తన కొచ్చిన తలనొప్పి బ్రెయిన్ ట్యూమరని తెలిసేలోగానే మరణించింది. అంతకు రెండేళ్ళముందు నా చెల్లెలి భర్త ఈ ట్యూమరుకే ఆపరేషన్ చేయించుకుంటూ ఆ బల్లమీదే ప్రాణం విడిచాడు. ఆ వ్యాధి ఎంత భయంకరమో ప్రాణాంతకమో నాకు బాగా తెలుసు.

రాత్రి భోజనం సహించలేదు. మెత్తనిపక్క ముళ్ళకంపలా గుచ్చుకుంది. తెల్లవారుజామున పట్టిన మగతనిద్రలో పీడకలలు.

ఆ తరవాత పట్టినట్టుంది కునుకు- మెలకువ వచ్చేసరికి తెల్లగా తెల్లారిపోయింది.

లేవగానే ఎదురు గోడకున్న దేవుళ్ళ పటాలకేసి చూసి అరచేతిలో 'శ్రీరామ' చుట్టి కళ్ళకద్దుకోవటం అలవాటు. ఈరోజు ఆ పని మనస్ఫూర్తిగా చేయలేకపోయాను.

ఆరోజే సిటీకి వెళ్ళాం. అనుమానం కాదు, నిజమే అని నిర్ధారణ అయింది.

మొదటిసారి విన్నంత షాక్ అనిపించలేదు.

# బుద్ధికి బుద్ధిలేదు

**– వలివేటి నాగచంద్రావతి**

కాకపోతే అణచుకున్న విషాదం వెళ్ళగక్కనీకుండా గొంతుకడ్డంపడుతూ చికాకు పెడుతూ... ఏదో వ్యక్తీకరించలేని భావన.

"ఆపరేషన్ చేస్తే తొంభై పాళ్ళు సరైపోతుందట" న్యూరోసర్జన్తో మాట్లాడి వచ్చాక చెప్పాడు నందగోపాల్.

అతని పాలిపోయిన మొహం, తడిగా ఉన్న కళ్ళూ మాటల్లో తడబాటూ చూశాక నాకు అర్థమయింది- 'హోప్స్ టెన్ పర్సెంట్ ఓన్లీ' అని డాక్టర్లు చెప్పి ఉంటారని.

ఆపరేషన్కి డేట్ ఫిక్స్ చేశారు... మరణానికి ముహూర్తం పెట్టినట్టు.

వ్యవధి ఉంది. డబ్బూ దస్కం చూసుకోవాలిగా. ఊరికి తిరిగివచ్చాం.

గుమ్మంలోకి అడుగుపెట్టగానే, "అమ్మా" అంటూ నన్ను చుట్టేసుకుని బావురుమంది మాలతి. ఈ సెల్ఫోన్ వచ్చాక వార్తలంద టానికి ఆలస్యం ఉండటంలేదు.

నాకొక్కగానొక్క బిడ్డ మాలతి. దాన్నొదిలి ఉండలేక అల్లుణ్ణి ఇల్లరికం తెచ్చుకున్నాను. ఇప్పుడు నేనే శాశ్వతంగా వదిలి వెళ్ళాల్సిన రోజొచ్చేస్తోంది. ఏం చెయ్యగలను?

కళ్ళు తడి అయ్యాయి.

"ష్షు... ఊరుకో మాలతీ. అమ్మని ఏడిపించొద్దు. మళ్ళీ తలనొప్పొస్తుంది. అయినా ఇప్పుడేమైందని?" అమ్మాయిని మందలిస్తోన్న నందగోపాల్ గొంతులోనూ తడి.

'నిర్లిప్తంగా ఉండాలిక' అని ఎంత ప్రయత్నం చేస్తున్నా, ఈ అనుబంధాల్లోని తీపి మనసును లాగేస్తుంది కదా!

మౌనంగా వెళ్ళి వీల్చైర్లో కూలబడ్డాను.

ఈ వీల్చైరంటే నాకెంతో ప్రియం. సింహద్వారం పక్కనే కిటికీకి దగ్గరగా ఆ చైర్లో కూర్చుని మెల్లగా ఊగుతూ బయటకు చూస్తే విశాలమైన ఆవరణ. పెద్ద ఇనుపగేటు. గేటుకి రెండుపక్కలా హైబ్రీడు కొబ్బరిమొక్కలు. ఇంటిముందున్న మెట్ల దగ్గర్నించీ గేటువరకూ వెడల్పుగా చప్టా. చప్టాకి అటూఇటూ రంగురంగుల గులాబీమొక్కలు కళ్ళకు విందుచేస్తాయి.

చూపులు లోపలికి తిప్పుకుంటే పెద్ద హాలు. నగిషీలు చెక్కిన దర్వాజాలూ రంగుపూల అద్దాలు బిగించిన ఫ్రెంచి విండోలూ మనసుని మురిపిస్తాయి.

ఇదంతా నా సొంతం, నా సామ్రాజ్యం అనుకుంటే ఎంతో తృప్తీ మరెంతో గర్వం కలిగేవి. కానీ ఇప్పుడో... మృత్యువు కళ్ళెదుట నిలబడింది. 'నావి నావి అని నువ్వనుకుంటున్నవేవీ నీవికావు. లే, లేచిరా నావెంట' అని గద్దిస్తోంది.

తిరుగులేని ఆజ్ఞ అది. ఎక్కడున్నవక్కడే వదిలేసి తలవంచుకుని దానివెనక వెళ్ళకతప్పదు.

ఏ క్షణాన ముగుస్తుందో తెలీని ఈ బతుకుకోసం, అల్పమైన ఈ శరీరంకోసం హైరానాపడి ఇన్ని ఆడంబరాలు, ఇంత కామాటం పెంచుకోవట మెందుకు? ఇన్నీ విడిచి వెళ్తున్నామే అని మథనపడ్డమెందుకు... అంతా మూర్ఖత్వం కాకపోతే.

☆ ☆ ☆

ఒకరోజు గడిచింది.

"అయ్యో తల్లీ, ఎంత కష్టమొచ్చింది నీకు. నాబోటి వాళ్ళనెంతమందిని ఆదుకున్నావు... ఆ పుణ్యమన్నా నిన్నాదుకోలేదా..?"

సోఫాలో కూర్చుని కాఫీ తాగుతోన్న నా కాళ్ళదగ్గర కూలబడి లబలబలాడుతోంది రాజమ్మ. రాజమ్మ మాకు పాలు పోస్తుంది. తరచూ నా దగ్గర అప్పు తీసుకునేవాళ్ళలో ఆమె ఒకతి.

"నువ్వు బాగుంటేనే కదా నాలాటి బడుగోళ్ళు పదిమంది బాగుండేది. ఆ మాయదారి తల్నొప్పి దేవతలాంటి నీగ్గాక ఎందుకూ పనికిరాని నాకు రాగూడదా" అంటూ కన్నీళ్ళు పెట్టుకుంటోంది.

నా గుండె నీరైంది. దాని అవసరాన్నడ్డుపెట్టుకుని నూటికి పదిరూపాయలు వడ్డీ గుంజుతూ అప్పిచ్చే నేను మంచిదాన్నట. ప్రాణాంతకమైన నా జబ్బు తనకి బదిలీ అవ్వాలట. ఎంత వెర్రిబాగుల్దో.

అదన్నమాట నిజమే. వీళ్ళు బడుగుజీవులు. సందు చివర పెంకుటింటి అరుగుమీద పొద్దుటిపూట ఇడ్లీలూ దోసెలూ వేసి అమ్ముకునే మాణిక్యమ్మా, తోపుడుబండి మీద కొద్దిపాటి కూరలతో చిన్నపాటి వ్యాపారం చేసుకునే వెంకటేశూ, బడ్డీకొట్టు నడుపుకునే ప్రసాదూ, సినిమాహాలు దగ్గర మిర్చిమసాలా చేసి అమ్మే

నటరాజూ, ఈ రాజమ్మా... వీళ్ళంతా ఆ కోవలోనివాళ్ళే.

ఒక్కమాటుగా వెయ్యిరూపాయల ఖర్చొచ్చి మీద పడితే తట్టుకోలేరు. ఆ సమయానికి ఆ గండంనుంచి గట్టెక్కించే నాలాంటివాళ్ళు వాళ్ళ దృష్టిలో దేవుళ్ళే.

ఆ కృతజ్ఞతతో కాస్తకాస్తగా వాయిదా పద్ధతిలో అసలుకి రెండింతలు కట్టాల్సొచ్చినా బాధపడరు. కాలం కలిసిరాక తాకట్టుపెట్టిన వస్తువు వాకట్టయినా కిమ్మనరు.

అలాగ ఇంట్లో కూర్చునే ఎంతో సంపాయించాన్నేను.

"సాయంత్రమే నీ కబురు విన్నా. మనస్సాగలేదు. మా పేట గుళ్ళో సాయిబాబా చాలా మహత్తుగల వాడమ్మా. ఆ గుడికెళ్ళి మొక్కి విభూతి తెచ్చా. ఇది పెట్టుకో తల్లీ, చల్లంగుంటావు".

ఇంత అభిమానం పొందటానికి అర్హతుందా నాకు?

దరిద్రులో అమాయకులో అనన్నా చూడకుండా వాళ్ళ రెక్కల కష్టాన్ని వడ్డీరూపాన వసూలుచేశానే - తాకట్టు సొమ్ముల్తో ఇనప్పెట్టె నింపానే - ఎందుకోసం?

ఈ అన్యాయార్జనంతా మూటగట్టిచ్చినా నా ఆయుష్షు ఒక్క నిమిషం పెంచగలరా ఇప్పుడెవరైనా? లేదే, మరెందుకోసమింత పాపాన్ని పోగేసుకున్నాను?

'భగవంతుడా, నన్ను క్షమించు' పశ్చాత్తాపంతో ఓ క్షణం కళ్ళుమూసి తెరిచాను.

అప్పటికప్పుడు పరిహారంగా వాళ్ళకేదయినా ఉపకారం చెయ్యాలని తహతహలాడ్తోంది మనసు. ఏం చెయ్యను? వాళ్ళని పిలిచి మీ అప్పులన్నీ మాఫీ చేశానని చెప్పనా? తాకట్టు వాకట్టు చేసిన వస్తువులన్నీ తిరిగి ఇచ్చెయ్యనా?

ఉహుఁ, అలా చేస్తే ఎవరైనా ఏమనుకుంటారు? పిచ్చిపట్టిందనుకుని వింతగా చూస్తారు. భరించగలనా అది?

అలాక్కాదు. ఒక్కటే ఉపాయం తోస్తోంది నాకు. లేచివెళ్ళి తెల్ల కాగితమొకటి తీసుకుని కూర్చున్నాను.

ముందుగా మాలతినీ నందగోపాలునీ సంబోధిస్తూ గమనిక రాశాను. దాన్లో రాసినవన్నీ నా వీలునామాగా భావించి అమలుపరచాలని.

ఆ తరవాత పేరాలో నా తదనంతరం నేను రుణమిచ్చిన వాళ్ళందరినీ దయగా చూడమనీ ధర్మవడ్డీ మాత్రమే తీసుకోమనీ కోరాను. ఆ కాగితాన్ని నా బీరువాలో తలుపుతీయగానే కనబడేటట్టుగా చీరలమీద పెట్టాను.

అమ్మాయి సరే. నందగోపాల్‌కి కూడా నేనంటే చాలా గౌరవం, అభిమానం. నామాట వాళ్ళిద్దరూ తప్పక మన్నిస్తారనే నమ్మకం నాకుంది.

ఎందుకో తెలీదుగానీ అలా చేశాక నాకెంతో ఊరటగా బాధోపశమనానికి మార్గం కనిపించినట్టుగా అనిపించింది. ఇంతవరకూ నన్ను కలవరపెట్టిన నా వ్యాధి, మరణభయం తేలికవటమేకాక ఇది అందరికీ సహజమైనదేలే అనుకోగలిగే స్థైర్యాన్ని నాలో నింపుతోన్నట్టుగా అనిపిస్తోంది. తీసుకోవటంలో ఉండే లాభం మాత్రమే తెలిసిన నాకు ఇవ్వటంలోగల ఆనందం మొట్టమొదటిసారిగా అనుభవానికొచ్చినట్టయింది.

ఒకరిని సంతోషపెట్టగలిగే ఓ మంచిపనికి చుట్టిన శ్రీకారానికే ఇంత ప్రభావమా!

ఆ ప్రేరణతోనే నేను చేస్తే బాగుంటుందనుకొన్న మరికొన్నిటిని ఆ కాగితంలో రాసినదానికి జోడించాను.

మా పొలం పండించే రైతు అప్పలస్వామి, తన కూతురు పెళ్ళనీ ఈ ఏడాది కౌలు డబ్బు కొద్దిగా తగ్గించుకొమ్మనీ ప్రాధేయపడ్డాడు మొన్న. ససేమిరా వీలుకాదన్నానప్పుడు. కాదంటే రైతునే మార్చేస్తానని బెదిరించాను కూడా.

ఈ ఏడాదే కాదు, మరో రెండేళ్ళు అతనిచ్చినంతే తీసుకోవాలనీ-

మా పనిమనిషి రంగమ్మకి నేను పెట్టుకునే ఎర్రరాళ్ళ కమ్మలంటే ఎంతో మనసు. 'నేను నా జన్మంతా కూడబెట్టినా అసుమంటివి చేయించుకోగలనా అమ్మా' అంటూ ఉంటుంది. దానికవి నా కానుకగా ఇచ్చెయ్యమనీ- ఇలాంటివి.

☆ ☆ ☆

ఒక్కొక్కరోజూ గడుస్తోంది. ఆపరేషన్ తేదీ సమీపిస్తోంది.

అదేంటో, జీవితం ముగింపుకొస్తున్న ఈ సమయంలో



నాకు బతుకుమీద కాంక్ష పెరిగిపోతోంది. గడుస్తున్న ప్రతి ఘడియనీ అమూల్యంగా దాచుకోవాలనిపిస్తోంది. పలకరించిన ప్రతి వ్యక్తిమీదా ఆప్యాయత గుమ్మరించాలనిపిస్తోంది. కనిపించిన ప్రతి దృశ్యమూ అద్భుతంగా అనిపిస్తోంది. వీటన్నిటికీ అందరికీ శాశ్వతంగా దూరం కాబోతున్నానన్న స్ఫురణ మనసును చిత్రవధ చేస్తోంది.

ఊరికే కూర్చుంటే ఏవో ఆలోచనలు. పోతున్నానూ పోతున్నానూ అని తెగ విచారపడిపోతున్నానేగానీ ఇన్నేళ్ళూ బతికుండి ఏం సాధించాను? వేమన అన్నట్టు పుట్టలోపుట్టిన చెదల్లాగే జన్మ ఎత్తాను. రేపు ఆ పుట్టమట్టిలోనే కలిసిపోబోతున్నాను. ఏముంది ప్రత్యేకత? కనీసం నా చుట్టూ ఉన్నవారి మనసుల్లోనైనా నా తరవాత నా జ్ఞాపకాన్ని మంచిగా ఉంచగలిగానా?

"అమ్మా"

మాలతి పిలుపు విని తలపైకెత్తాను. మాలతి, పక్కన నందగోపాల్ కూడా ఉన్నాడు.

ఏమిటన్నట్టు చూశాను.

"ఆపరేషన్‌కి నాలుగైదు లక్షలు చేతిలో ఉంచుకోవటం మంచిది. కిందటినెల్లో పాతిక లక్షలుపెట్టి ఆ మామిడితోట రిజిస్ట్రేషన్ చేయించుకోకపోయుంటే ఇప్పుడు డబ్బుకింత వెదుకులాట ఉండకపోను. ఆ గరువుకింద రెండెకరాలు అమ్మకానికి పెడదామంటారా అత్తా? అద్దైతే మంచి పొలం కాబట్టి తొందరగా అమ్మకమవుతుంది? "

"ఇప్పుడా పొలాలూ స్థలాలూ అమ్మకమయ్యీ వాళ్ళు డబ్బుకి గడువులుపెట్టీ అది అందేదాకా మనకు టెన్షను పెరిగీ... ఎందుకమ్మా ఈ రిస్కంతా? ఎప్పట్నుంచో పడున్నాయి ఆ లాకర్లో నగలు. అవి అమ్మేస్తే సరిపోదా? " మాలతి మాటలు నన్ను ఉలిక్కిపడేలా చేశాయి.

లాకర్లో నగలా?

"వద్దు వద్దు. ఆ పొలమే అమ్మేసేయండి".

తెల్లబోయి చూస్తున్న వాళ్ళిద్దరివంకా చూడకుండా ముందు హాల్లోకొచ్చేసి వీల్‌చైర్లో కూర్చుండిపోయాను కళ్ళుమూసుకుని.

తలనిండా జ్ఞాపకాలు- జోరీగల్లా రొదపెడుతూ.

ఆ నగలు తులసికి చెందాల్సినవి!

తులసి, పురిట్లోనే తల్లిని పోగొట్టుకున్న దురదృష్టవంతురాలు. నాకు సవతి కూతురు.

నిశ్చితార్థానికి ముందే నన్ను ఒంటరిగా కలిశారు ఆయన. "తులసిని నీ బిడ్డలా చూసుకోగలనని నాకు మాట ఇస్తేనే ఈ పెళ్ళి జరుగుతుంది" అన్నారు.

రెండోపెళ్ళివాడన్న ఒక్క లోపంతప్పించి ఆయన వయసు చిన్నది. ఆడపిల్ల మనసు దోచగల అందగాడు. అంతేకాదు, కోటీశ్వరుడు.

నేను మాట ఇచ్చేశాను.

మరణశయ్యమీద ఉన్నప్పుడూ ఆయన ఇదే కోరిక కోరారు. "ఆస్తంతటినీ నీ ఇష్టానుసారమే నీ పేర రాశాను- తులసికి అన్యాయం చెయ్యవన్న నమ్మకంతోనే. ఆ నమ్మకాన్ని వమ్ము చెయ్యవుగా" అని.

అప్పుడూ మాటిచ్చేను- ఆ నిమిషానికి మనస్ఫూర్తిగానే.

కానీ ఆ తరవాత-

తులసి స్వర్ణప్రతిమ. దాని అందంచూసి పైసా కట్నం అక్కర్లేదంటూ ఎన్నో సంబంధాలొచ్చాయి. వాటిల్లో దానికిష్టమైన వరుణ్ణి చూసి పెళ్ళిచేశాను.

వరకట్నం అడగని పెళ్ళికొడుకు దొరికాడన్న సంబరంలో యథాలాపంగా "పిల్లని ఒట్టిచేతుల్తో పంపుతున్నామనుకోకండి. తల్లి నగలన్నీ దానివే" అని మాటజారేను.

అదిగో ఆ తప్పే నా ముక్కుపట్టుకుంది.

అప్పట్నించీ దాని అత్తగారు "మీ అమ్మ నగలు ఇస్తానందిగా మీ పిన్ని, అవి పట్టుకురా" అంటూ దాన్ని తెగ సతాయించటం, పుట్టింటికి తరమటం. తులసేమో నా దగ్గరకొచ్చి నిష్ఠూరాలాడ్డం.

అది అడిగింది కదా అని నేనివ్వగలనా? నగలా అవి, బంగారం పాతర. చూస్తూచూస్తూ ఎలా ధారపోయగలను.

అప్పటికీ ఓ రెండు గొలుసులూ నాలుగు గాజులూ ఇచ్చి పంపాను- ఇవే మీ అమ్మ నగలూ అని.

ఊహుఁ... ఆ అత్త దేవాంతకురాలు. ఎక్కడ ఎంక్వయిరీ చేసిందో ఏమో, "నేను పిచ్చిదాన్ని కాదు. ఇవ్వకపోతే ఇవ్వనని చెప్పండి. ఆవిడకేమేమి నగలున్నాయో నాకు తెలుసు" అంటూ స్వయంగా దండయాత్రకొచ్చింది నామీదకి.

నేనా తొణికేది? "మిగతావన్నీ ఆయన జబ్బుకే కరిగిపోయాయి. మీరు నమ్మినా నమ్మకపోయినాసరే ఉన్నవవే" అని నిక్కచ్చిగా తేల్చేశాను.

ఇక ప్రత్యక్షంగా ఏం చెయ్యలేక పరోక్షంలో నేను కూతుర్ని మోసంచేశానని అందరి దగ్గరా ప్రచారం మొదలుపెట్టింది. నేను పట్టించుకోలేదు. తులసిని మా ఇంటికి పంపడం మానేసింది. మరీ మంచిదనుకున్నాను. 'పాపం, తులసిని రాచి రంపాన పెడుతోందట. ఆ మొగుడు కూడా తల్లికే వత్తాసట' అనే గాలివాలు వార్తలు వినవచ్చాయి. వినీవిననట్టుగా ఉండిపోయాను.

ఇదీ ఆ నగల కథ.

నేనెంత కఠినంగా వ్యవహరించానో ఇప్పుడు సమీక్షించుకుంటుంటే తెలుస్తోంది. ఆ నగలు అప్పుడూ లాకర్లోనే ఉన్నాయి, ఇప్పుడూ లాకర్లోనే ఉన్నాయి. వాటివల్ల నాకు ఒరిగిందేమీలేదే?

అవి పెట్టుకునే గీతెటూ నాకులేదు. అవి లేకపోతే నాకూ నా బిడ్డకూ తక్కువైపోతుందన్న స్థితీకాదు. మరెందుకు వాటిమీద మోహం నాకు?

కాస్త మనసు విశాలం చేసుకుని నా భర్తకిచ్చిన మాట నిలబెట్టుకునుంటే తులసి జీవితం సంతోషంగా గడిచి ఉండేది కాదూ. సొంత తల్లిని కాకపోయినా 'అమ్మా' అని పిలిచే ఆ బిడ్డ మనసులో నేను తల్లిస్థానంలో ఎప్పటికీ నిలిచి ఉండేదాన్ని కాదూ-

అయిందేదో అయిపోయింది. ఇప్పటికైనా కళ్ళు తెరుచుకున్నాయి. రేపు ఆ లోకంలో ఉన్న నా భర్త దగ్గరకు అపరాధభావనతో జంకుగా వెళ్ళకూడదు గదా!

'రేపు పిలిచి దాని సొత్తు దానికప్పగించేస్తాను' అనుకున్నాక మనసు స్థిమితపడింది.

అనుకున్నట్టుగానే మర్నాడు తులసికి ఫోన్ చేశాను. దాని భర్త ఫోన్ తీశాడు.

కాస్త తటపటాయింపుగా "నా ఒంట్లో బాగుండటం లేదు. ఓసారి తులసిని పంపించండి. కొన్ని సంగతులు కూడా చెప్పాల్సి ఉంది. తప్పకుండా పంపించండి" అని చెప్పాను. ఔనూ కాదూ అనకుండా ఫోన్ పెట్టేశాడు.

తులసి రాలేదు.

ఏం చేయను? నే రాస్తున్న కాగితంలో ఇంకో పేరా పెంచిరాయటం తప్ప!

☆ ☆ ☆

ఆసుపత్రి...

ఇంకాసేపటిలో ఆపరేషన్. థియేటర్‌లోకి వెళ్ళబోయేముందర కన్నీళ్ళాపుకుంటూ నాకు ధైర్యం చెప్పటానికి ప్రయత్నిస్తోన్న నా కూతుర్ని ఒక్కసారి దగ్గరగా పొదుపుకున్నాను. అల్లుణ్ణి కళ్ళతోనే సెలవడిగాను.

వీల్‌చైరు కదిలింది.

ఆపరేషన్ థియేటర్ సరిగ్గా ఈ లోకానికీ మరో లోకానికీ మధ్య గీసిన సరిహద్దు రేఖలా ఉంది.

కళ్ళుతప్ప మిగతా శరీరాన్నంతా ఆకుపచ్చ యూనిఫాంలో కవరుచేసుకున్న డాక్టర్లూ నర్సులూ జీవుల్ని పైకో కిందికో తేల్చి తోసేసే న్యాయనిర్ణేతల్లా ఉన్నారు.

ఆపరేషన్ టేబుల్‌పైన తీర్పుకోసం ఎదురుచూసే నేరస్థురాలి స్థానంలో ఉదాసీనంగా పడుకొని ఉన్నాను నేను.

డాక్టరనుకుంటా- సిరంజితో దగ్గరగా వచ్చారు. తళుక్కుమంటున్న రెండుకళ్ళు నన్ను స్నేహంగా చూస్తున్నాయి.

ఇదే నేను చూసే చివరి చూపా?

"చిన్న ఇంజక్షన్" కోమలంగా ఉన్న ఓ స్వరం మార్దవంగా పలికింది.

ఇదే నేను వినే చివరి స్వరమా?

చురుక్. ఇదే నా చివరి...

☆ ☆ ☆

"రాజేశ్వరీ... రాజేశ్వరీ... కళ్ళు తెరవండీ... తెరవండీ".

ఎక్కణ్ణించీ పిలుపు? ఇంకో లోకం వచ్చేశానా? ఇక్కడ కూడా నన్ను ఎరిగినవాళ్ళు ఉన్నారా? ఆశ్చర్యం! వీళ్ళు కూడా మన బాషే మాట్లాడు తున్నారే? ఎలా ఉంటారు వీళ్ళు? ఎంత ప్రయత్నించినా కళ్ళు తెరిపిడి పడటంలేదే?

"రాజేశ్వరీ లేవండీ, కళ్ళు తెరవండీ" హెచ్చరిస్తూ చెంపలుతట్టిన స్పర్శ.

బలవంతాన కళ్ళు విప్పాను. ముందు అంతా మసకమసక. మెల్లమెల్లగా స్పష్టత వచ్చింది దృష్టికి.

ఏ లోకమిది?

తెల్లటి పైకప్పూ తెల్లటి గోడలూ తెల్లటి యూనిఫాంలూ తెల్లటి చిరునవ్వులూ... ఊహు... ఇది వేరే లోకంకాదు. నా లోకమే. నేను బతికే ఉన్నాను.

'భగవాన్, కరుణించావా!'

"అదృష్టవంతురాలివమ్మా. చాలా ఎర్లీ స్టేజిలో ఉండటంవల్ల నిన్ను సేవ్ చేయగలిగేం. ఇక నీకే భయం లేదు" డాక్టర్లు భుజం తట్టారు.

నెల్లాళ్ళలో మిగిలిన ట్రీట్‌మెంటు ముగించుకుని ఇంటికి వచ్చాను.

వెళ్ళగానే మొట్టమొదట నేను చేసినపని, నా బీరువాలో నేను మతిలేకుండా రాసిపెట్టిన కాగితాన్ని తీసి ముక్కలుచేసి పడెయ్యటం- నయం ఎవరికంటా పడిందికాదు.

నేను వచ్చానని తెలిసి, తెలిసినవాళ్ళు ఒక్కొక్కరూ వచ్చి చూసి వెళ్తున్నారు.

"తల్లీ వచ్చేశావా? నా మొర ఆ సాయిబాబా విన్నాడమ్మా. చూశావా, ఆ విభూతి మహత్యం. నీ దగ్గరకిక ఏ పీడా చేరదమ్మా. నువ్వు ఎప్పటికీ చల్లంగుంటావు" రాజమ్మ చేతులు పైకి చూపెడుతూ దణ్ణాలుపెడుతూ వచ్చేసింది.

నవ్వి, "మీ అందరి ప్రార్థనల ఫలితమేనే" అని ఇంకాస్త ఉబ్బేశాను.

దొంగముండ, నాకు తెలీదా దీని ఎత్తులు. ఇట్లా దొంగేడుపులు ఏడ్చి, ఆ తరవాత వడ్డీలో మినహాయింపడుగుతుంది భడవ.



నేనా ఈ ఎత్తులకి చిత్తయ్యేది?

"కిందటి నెల్లో వడ్డీ కూడా కట్లేదట. అసలే ఖర్చుల్లో ఉన్నా. తొందరగా జమకట్టు" అని హెచ్చరించి పంపాను.

ఆ సాయంత్రం తులసి వచ్చింది. "అమ్మా" అంటూ దగ్గర కూర్చుని కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

మొదలు... అమ్మా బొమ్మా అంటూ వెధవ నస. కడుపులోలేంది కావలించుకుంటే వస్తుందా అనీ, నన్ను వందసార్లు అమ్మా అమ్మా అంటే కన్నతల్లినవు తానా? కన్నబిడ్డకుండే మమకారం నామీద తనకి పొంగిపోతోందంటే నమ్ముతానా?

"నీకు ఆపరేషనంటే ఎంత భయపడ్డానో... ఎంత ఏడ్చానో".

ఆహా...

"బతిమాలగా బతిమాలగా ఇప్పటికి పంపించారమ్మా".

ఉద్ధరించారు.

వెళ్ళబోయేముందర "ఏదో చెప్పాలన్నావుట..."

అదీ అసలు సంగతి. చివరి దశలో ఉన్నాను. అప్పనంగా చేతికందించేస్తాను, మూటగట్టుకుపోదామని వచ్చిందన్నమాట పాపం.

"ఏవుందీ, ఉంటానో ఊడతానో అన్న స్థితి. పెద్దదానివి, నాకేమన్నా అయితే చెల్లెల్ని చూసుకుంటుండమ్మా అని చెబుదామనుకున్నాను".

తులసి వెళ్ళిపోయింది.

వెళ్ళి వీల్‌చైర్లో కూర్చున్నాను కులాసాగా.

గాలివాన వచ్చి వెలిసినట్టుగా ఉంది. తేలిగ్గా ఉంది. ఉత్సాహంగా ఉంది. హాయిగా ఉంది.

కిటికీలోంచి బయటకు చూశాను.

విశాలమైన ఆవరణా పెద్ద గేటూ రెండుపక్కలా హైబ్రీడు కొబ్బరిమొక్కలూ మెట్ల దగ్గర్నించీ గేటుదాకా వెడల్పుగా చప్టా గులాబీ అంట్లూ... కళ్ళకు విందు.

లోపలికి చూశాను. పెద్ద హాలూ నగిషీలు చెక్కిన దర్వాజాలూ రంగుటద్దాలు బిగించిన ఫ్రెంచి విండోలూ మనసును మురిపించాయి.

వీల్‌చైర్లో వెనక్కి వాలాను గర్వంగా.

ఇది నా సామ్రాజ్యం. నేనే మహారాణిని. నాకెవరు సాటి? ★